క్లుప్తంగా

అమ్మనబ్రోలులో ఉచిత పశువైద్య శిబిరం

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలులో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒంగోలు పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్. బేబీరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భకోశ వ్యాధుల వలన పశువులు తిరగకట్టి సకాలంలో ఎదకు రావని, సూడివి కావని తెలిపారు. అటువంటి పశువులను శిబిరంలో పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డీఎల్‌డీఏ ద్వారా 20 వేల రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు డీఎల్‌డీఏ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ కాలేషా తెలిపారు. రైతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ



ఒంగోలు అర్బన్: శక్తిసదన్‌కు సూర్యశ్రీ ట్రస్టు బుధవారం రూ.12 వేల విలువైన నిత్యావసర సరుకులు వితరణ చేశారు. హౌసింగ్ బోర్డులో ఉన్న శక్తి సదన్ హోంకు రాజ్‌కుమార్ కనపర్తి ఆర్థిక సహకారంతో బియ్యం, నూనె, కంది పప్పు, తదితర నిత్యావసర వస్తువులను ట్రస్టు సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాషా, టి.అరుణ, మారెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం నియోజకవర్గ చైర్మన్‌గా కిషోర్



కిషోర్‌కు నియామక పత్రం అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి

పొదిలి: మానవ హక్కుల సంఘం, అవినీతి నిరోధక సంఘం మార్కాపురం నియోజకవర్గ చైర్మన్‌గా పట్టణానికి చెందిన జి.కిషోర్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా సంఘం కోసం పని చేస్తానని చెప్పారు.

అడవిపంది మాంసం కలిగిన వ్యక్తులు అరెస్టు

గిద్దలూరు రూరల్: అడవి పంది మాంసం కలిగిన ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు బుధవారం అదుపులోనికి తీసుకున్నారు. మండలంలోని గడికోటకు చెందిన ఇద్దరు అంకణాంపల్లెకు చెందిన ఒకరు మొత్తం ముగ్గురు వ్యక్తులు దేవనగరం లింగాపురం గ్రామాల మధ్యలో అడవి పంది మాంసం కలిగి ఉండటం గమనించిన అటవీశాఖ అధికారులు వారిని అదుపులోనికి తీసుకున్నారు. ఈ ఘటనలో ఇంకా ఎవరిదైనా పాత్ర ఉందా అన్న కోణంలో విచారిస్తున్నారు. విచారణలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని రేంజ్ ఆఫీసర్ కుమార్‌రాజు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో సాధన విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం: బుధవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో మార్కాపురంలోని శ్రీ సాధన కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో సీహెచ్ యశశ్రీ 470 మార్కులకుగాను 466 మార్కులు, బి.గోవర్థిని 465, షేక్ హుస్సేన్ 464, కె.మల్లేశ్వరి 464 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను 492 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల డైరెక్టర్స్ వీఆర్‌కే ప్రసాద్, డి.రాజగోపాల్‌రెడ్డి, డి.కృష్ణారెడ్డి, జి.లావణ్య రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాసులు అభినందించారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

కందుకూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో బాల బాలికల ఎంపిక పోటీలు గురువారం పట్టణంలోని టీఆర్‌ఆర్ కాలేజీ ఆవరణలో జరుగుతాయని జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం తెలిపారు. 12 నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకుని గురువారం ఉదయం 10గంటలకు టీఆర్‌ఆర్ కాలేజీ గ్రౌండ్‌కు రావాలని సూచించారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీ, వచ్చే నెల 1వ తేదీన విశాఖపట్నంలోని పోర్టు స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పూర్తి వివరాలకు 8686240540, 9494946207 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మత్స్య సంపదతో ఆర్థికంగా ఎదగాలి

- నాబార్డ్ డీడీఎం రవికుమార్



ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు అవగాహన కల్పిస్తున్న నాబార్డ్ డీడీఎం రవికుమార్

మదనూరు (కొత్తపట్నం): మత్స్య సంపదతో రకరకాల ఆదాయం వచ్చే వాటిని తయారు చేయడం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డీడీఎం జె.రవికుమార్ సూచించారు. మదనూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో నాబార్డ్ సౌజన్యంతో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డ్వాక్రా గ్రూపు సభ్యులకు సముద్ర ఆహార ఆధారిత ఊరగాయల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో పడే మత్స్య సంపదతో ఊరగాయ తయారీ చేసుకుంటే మత్స్యకారుడికి అధికంగా ఆదాయం వస్తుందన్నారు. చిన్న, సన్న మత్స్యకారుడు ఇటువంటి మెలకువలు చేసుకోవడం వలన ఎక్కువ లాభం ఆర్జించవచ్చన్నారు. వచ్చిన మత్స్య సంపద అమ్ముకోకుండా ఊరగాయ పెట్టుకుని విక్రయిస్తే రెట్టింపు ఆదాయం చూడవచ్చన్నారు. ఎక్కువగా మహిళలు దీనిపై దృష్టి సారించాలన్నారు. తీర ప్రాంతంలో మహిళా మత్స్యకారులు ఈ విధంగా ఊరగాయ తయారు చేసి అమ్ముకోవడం వలన ఎంతో మంది ఆర్థికంగా అభివృద్ధి చెందారని తెలిపారు. అనంతరం మత్స్య సంపదతో ఊరగాయ ఏ విధంగా తయారు చేయాలో చేసి చూపించారు. శిక్షణ కార్యక్రమంలో 90 మంది మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. ఎల్‌డీఎం డి.రమేష్, మదనూరు సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ కె.అశోక్ కుమార్, ఒంగోలు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ప్రేరణ స్వచ్ఛంద సంస్థ సీఈవో నాగలక్ష్మి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సురేష్, ప్రేరణ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మైనర్ బాలిక అప్పగింత

- తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలో బాలికను కనుగొన్న బృందం
- విచారించి తల్లిదండ్రులకు అప్పగించిన ప్రకాశం జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ రామాంజనేయులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చైర్మన్ రామాంజనేయులు, కమిటీ సభ్యులు

ఒంగోలు సెంట్రల్: తెలంగాణ రాష్ట్రంలో పాన్ ఇండియాలో భాగంగా ప్రత్యేక రెస్క్యూ బృందం తనిఖీ చేస్తుండగా, ములుగు జిల్లా ప్రాంతంలో బాతులు మేపుతున్న వారి వద్ద ఓ మైనర్ బాలికను గుర్తించారు. ఆ బాలికను విచారించగా తన మామయ్య వద్ద ఉంటూ బాతులు మేపుకుంటూ జీవిస్తున్నానని చెప్పింది. తనది ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం సుందర్‌నగర్ అని, కామంచి సప్తగిరి, కామంచి ప్రభావతి కుమార్తెనని, తన పేరు కవిత అని తెలిపింది. ములుగు జిల్లా బాలల సంరక్షణ విభాగం, జిల్లా బాలల సంక్షేమ కమిటీ ముందు బాలికను హాజరుపరచగా బాలిక కవితకు బాలిక సదన్‌లో ఆశ్రయం కల్పించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ప్రకాశం జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ వేము రామాంజనేయులు సూచనలతో కేసును బదిలీ చేశారు. అనంతరం సీడబ్ల్యూసీలో తల్లిదండ్రులను విచారించగా తమకు ముగ్గురు కుమార్తెలని, కవిత రెండో సంతానమని, చిన్ననాటి నుంచి చదువుకోలేదని తెలిపారు. బాలిక వారి కుమార్తె అని జిల్లా బాలల సంక్షేమ కమిటీ నిర్ధారించింది. అనంతరం చైర్మన్ రామాంజనేయులు, కమిటీ సభ్యులు కె.సుమన్, టి.శివశంకర్, గ్రామ పెద్దల సమక్షంలో కవితను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను పనికి పంపడం నేరమని, జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు. గ్రామాల్లో ఎవరైనా పాఠశాలలు మాని వేసి పనులకు వెళ్తుంటే తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో బాలసదనం సూపరింటెండెంట్ డి.జీవిత, బాలసంరక్షణ అధికారి శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వేదపురోహితులు, అర్చకులకు సన్మానం



అర్చకులు, పురోహితులను సన్మానిస్తున్న బ్రహ్మకుమారి నిర్వాహకులు



సన్మానం అందుకుంటున్న బ్రహ్మశ్రీ వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి

ఒంగోలు మెట్రో: భక్తి జ్ఞాన సంగమం ద్వారా సనాతన ధర్మ పరిరక్షణకై పాటుపడుతున్న దేవస్థానంలోని అర్చకులు, వేదపురోహితులకు ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక సంతపేట బాల సంజీవని ధామం బచ్చల బాలయ్య సంజీవమ్మ ధార్మిక భవనంలో గల కృష్ణప్రియ కన్వెన్షన్ హాలులో బుధవారం సాయంత్రం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆధ్యాత్మిక రంగం ద్వారా దేవునికి–భక్తులకు అనుసంధానంగా అర్చకులు, వేద పురోహితులు చేసేటువంటి విశేష కృషికి గుర్తింపుగా బెంగళూరు నుంచి విచ్చేసిన రాజయోగి బ్రహ్మకుమార్ మంజునాథ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంతపేట సాయిబాబా మందిర నిర్వాహకులు అళహరి చంచలరావు, బ్రహ్మశ్రీ వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి, భవన దాతలు టి.మునికృష్ణయ్య, హరిప్రియ దంపతులు, డీఆర్డీఏ వరప్రసాద్ మాధవి, రామలక్ష్మి, రేవతి, నగరంలోని వివిధ దేవస్థానాల్లో పనిచేస్తున్న 60 మంది అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు .

నా భర్తను నాకు అప్పగించండి

- పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు

ఒంగోలు టౌన్: తన భర్తను తనకు అప్పగించాలంటూ ఓ మహిళ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చప్పిడి అనామిక, చప్పిడి నాని ప్రేమ వివాహం చేసుకుని నగరంలోని సీతారామపురంలో నివాసం ఉంటున్నారు. ఇరు కుటుంబాల సభ్యులకు దూరంగా ఇద్దరే జీవిస్తున్నారు. మే 11న నాని సోదరుడు డేవిడ్, మేనమామ ఈగల రాజేష్, చప్పిడి ఇమ్మానియేలు ఒంగోలు వచ్చి మా అబ్బాయిని తీసుకెళ్లి ఓటు వేయించి పంపిస్తామంటూ పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని వెల్లటూరు తీసుకెళ్లారు. ఆ తర్వాత నాని తిరిగి రాలేదు. ఫోన్ చేసి మాటాడేందుకు ప్రయత్నించినా.. అందుబాటులోకి రావడం లేదు. అతడిని పంపించేది లేదని, చేతనైంది చేసుకోమని నాని కుటుంబ సభ్యులు చెబుతున్నారని అనామిక ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. నాని ఊరికెళ్లే సమయంలో ఇంట్లో ఉన్న బంగారపు నల్లపూసల దండ, బ్రాస్‌లెట్, రెండు జతల కమ్మలు, కొంత నగదు, ఒక ద్విచక్ర వాహనం తీసుకెళ్లాడని, వాటి కోసం నానిని కుటుంబ సభ్యులు ఏమైనా చేస్తారేమో అని భయంగా ఉందని తెలిపింది. వెంటనే తన భర్తను తనకు అప్పగించేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు తనకు న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనకు దిగింది. ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో శ్రీ ప్రతిభ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ ప్రతిభ చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు



చీమకుర్తిలో విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రిన్సిపాల్ శివారెడ్డి, అధ్యాపకులు

ఒంగోలు: జూనియర్ ఇంటర్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాజాగా విడుదలైన అడ్వాన్డ్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో తమ కాలేజీ విద్యార్థులు గొర్ల శృతి–467, చిన్నపరెడ్డి వెంకట త్రిష–466, బాదం యోగ లక్ష్మి, అట్లా వెంకట ప్రసాద్, షతపత్రం బాలకృష్ణ, కుమ్మర వెంకట కళ్యాణ్‌రామ్, నవులూరి శ్రీమహాలక్ష్మి, నాగినేని లక్ష్మీదీపిక, కొణిజేటి వెంకటసాయి పూజిత 465 మార్కులు సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో వెలుగు హాసిని 433/440 మార్కులు, దొండపాటి స్నేహారెడ్డి–426/440 మార్కులు సాధించారన్నారు. 464 మార్కులకుపైగా 17 మంది, 463 మార్కులకుపైగా 26 మంది, 462 మార్కులకుపైగా 33 మంది, 461 మార్కులకుపైగా 39 మంది, 460కిపైగా 47 మంది, 450కిపైగా 108 మంది, 440కిపైగా 168 మంది, 430 మార్కులకుపైగా 227 మంది, 420 మార్కులకుపైగా 279 మంది, 410 మార్కులకుపైగా 321 మంది, 400 మార్కులకుపైగా 369 మంది సాధించారని వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ తెలిపారు.

చీమకుర్తి ఎంఎస్‌ఆర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ...

చీమకుర్తి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో చీమకుర్తి ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఇంటర్ ఎంపీసీ గ్రూపులో పోకల జయవర్షిణి మొత్తం 470 మార్కులకుగానూ 462 మార్కులు సాధించినట్లు తెలిపారు. బల్లిపల్లి శివాణి 461 మార్కులు, శాంబెల్ కిషన్ 460 మార్కులు సాధించినట్లు వివరించారు. బైపీసీ గ్రూపులో 440 మార్కులకుగానూ ముక్తవరపు శ్రీవాణి 428 మార్కులు, సీఈసీ గ్రూపులో మొత్తం 500 మార్కులకుగానూ గుంజి రిబ్కా 458 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శివారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



రాజుగారిపల్లిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహ్మదాపురం రాజుగారిపల్లి ఎస్సీకాలనీలో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. గొట్టిముక్కల నరసింహులు దంపతులు అందించిన పట్టువస్త్రాలు, పూజా సామగ్రి అర్చకులు స్వామికి సమర్పించారు. అనంతరం వేద మంత్రాల నడుమ సీతారాములకు తలంబ్రాలు పోసి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



సమీక్షిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు

ఒంగోలు: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఇంజినీరింగ్ సెక్షన్, శానిటేషన్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షించారు. పైపులైన్ల లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించడంతో పాటు రోజువారీ నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డు అమెనిటీస్ సెక్రటరీల ద్వారా రెసిడ్యుయల్ క్లోరిన్ పరీక్షలను సక్రమంగా నిర్వహిస్తూ నీటి నాణ్యతను తనిఖీ చేయించాలన్నారు. నగరంలోని పాట్ హోల్స్ గుర్తించి ప్యాచ్ పనులకు తక్షణమే అంచనాలను సిద్ధం చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. వీధి దీపాలను పర్యవేక్షించి ఎక్కడైనా లైట్లు వెలగకపోతే తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వీధి దీపాలు వెలగక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో కాలానుగుణంగా వ్యాధులు/అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు, కాలువల్లో సిల్ట్ తొలగించడాన్ని ప్రతిరోజూ తూచా తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని కమిషనర్ జస్వంతరావు ఆదేశించారు.

డాక్టర్ వంకాయలపాటికి నివాళి



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళామిత్ర మండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మంగి గేయ కావ్య సృష్టికర్త, పలు గ్రంథాల రచయిత డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ మరణం సాహిత్య లోకానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో కళామిత్ర మండలి తెలుగు లోగిలి జాతీయ సంస్థ, నరసం సంయుక్త నిర్వహణలో వంకాయలపాటి రామకృష్ణ తృతీయ వర్ధంతి సభ నిర్వహించారు. కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు పర్యవేక్షణలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ వంకాయలపాటి రామకృష్ణ కళామిత్ర మండలికి ప్రధాన కార్యదర్శిగా, ఎన్టీఆర్ కళాపరిషత్తుకు పీఆర్‌ఓగా చేసిన సేవలు తాను జీవితంలో మర్చిపోలేనని అన్నారు. రామకృష్ణ సేవలను పలువురు కొనియాడారు. సభలో నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, మిడసల మల్లికార్జునరావు, బీరం అరుణ, నూకతోటి శరత్‌బాబు, మహతి, తన్నీరు బాలాజీ, కె.బాలకోటయ్య, గుంటూరు సత్యనారాయణ, నాళం నరసమ్మ, శాంతిలత, డాక్టర్ దారా సుబ్బారావు, సీహెచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని రామకృష్ణతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పనిచేస్తున్న శాఖకు మంచి పేరు తేవాలి



కారుణ్య నియామక ఉత్తర్వులు అందచేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కారుణ్య నియామక పత్రాలు అందచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: బాధ్యతతో విధులు నిర్వహించి పనిచేస్తున్న శాఖకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు బుధవారం క్యాంపు కార్యాలయంలో కారుణ్య నియామకాల కింద 16 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధులు అంకిత భావంతో నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, ఏఓ శ్రీకాంత్, మల్లికార్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారి దర్శనం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



అశ్వ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న భూనీలా సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉదయం 6 గంటలకు స్వామివారికి అష్టోత్తర, సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. 9 గంటలకు చక్రస్నానం చేయించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ టీపీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎం.కొండలరావు, అధనపు కార్యదర్శి నిట్టూరి వెంకట రమేష్, కోశాధికారి వేముల పిచ్చిరావు, ప్రతినిధులు రావిపాటి రాజా, విట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం

పొదిలి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప దేవాలయం వద్ద ప్రతి బుధవారం అన్నదానం చేస్తున్నారు. పరిమి చిన్న నాయుడు, చిన్న సుబ్బులు, శివయ్య, లీల దంపతులు ఉభయ దాతలుగా బుధవారం అన్నదానం చేశారు. అర్చకులు మురళీకృష్ణామాచార్యులు పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్, రామాపురం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఉభయదాతలు మేడా నరసింహారావు, రమాదేవి దంపతులను మేళతాళాలతో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అమ్మవారి అనుగ్రహం కోసం సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చక సలహాదారు మురళీకృష్ణమాచార్యులు చెప్పారు. పూజల అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, పి.భాస్కర్, వెలిశెట్టి నారాయణ, సామి రాజా తదితరులు పాల్గొన్నారు.